# అప్పుడు - ఇప్పుడు

- శ్యామలాదేవి దశిక

ఏమిటీ మీ అక్కయ్య మనవరాలిని-మొగుడిని ఒకసారి మనింటికి పిలిస్తే బావుంటుందా?

నిజమే బాగానే వుంటుంది!

మీరు ఎప్పుడూ చూడని వాళ్ళను చూసినట్టూ వుంటుందీ, దేశం కాని దేశంలో ఏం అవస్థలు పడుతోందో అని ఊహించుకుని మరీ బెంగెట్టుకుంటున్న మీ అక్కయ్యను సంతోషపెట్టినట్టూ వుంటుంది!

కానీ ఏదో సామెత చెప్పినట్టు మీరు పిలుద్దామన్నా, రావడానికి వాళ్ళకు తీరుబడి, ఇంటరెస్టూ వుండద్దూ?

మీరు, మీ అక్కయ్య పాతకాలం వాళ్ళు. కాలం మారుతున్నా మీరు వెనకబడేవున్నారు!

వాళ్ళను ఒక్కసారి కూడా పిలవకుండా నేను ఇన్ని చదువులు చదవడం ఏమీ బావులేదా?

అందుకే అన్నాను మీరు వుట్టి అమాయకులని.

నేను పిలవలేదని ఎందుకనుకుంటున్నారు?

ఆ అమ్మాయి వచ్చిన మూడునెలల్లో మూడు సార్లు పిలిచాను తెలుసా?

నేను మొదటిసారి పిలిస్తే 'మేము హనీమూన్ కు యూరప్ వెళ్తున్నాం అండీ" అంది!

పోనీలే కొత్త జంట హాయిగా తిరుగుతున్నారనుకొన్నాను.

నెల రోజుల తర్వాత మళ్ళీ పిలిచాను మనింటికి రమ్మని.

అబ్బే, నాకిప్పుడుససేమిరా కుదరదు పొమ్మంది!

ఏమిటీ అంటే ఆ అమ్మాయితో చదువుకున్న వాళ్ళందరూ ఈదేశంలోనే వున్నారట.

వాళ్ళందరూ ఈ అమ్మాయి దగ్గరకు వస్తున్నారట.

అక్కడనుంచి ఈ అచ్చాడీలందరూ కలిసి ఓ వారం రోజులపాటు లాస్ వేగస్ వెళ్ళి వస్తారుట!

"మీరు ఒక్కళ్ళే ఎందుకు వెళ్ళడం, చక్కగా మొగుళ్ళతో వెళ్ళొచ్చుగా" అన్నా.

దానికి ఆ అమ్మాయి ఏమందో తెలుసా?

'మేము అందరం కావాలనే ఇలా వెళ్తున్నాం. వుయ్ నీడ్ ఏ బ్రేక్ ఫ్రమ్ అవర్ మొగుడూస్' అంది!

చూసారా? నిన్నగాక మొన్న పెళ్ళి అయిందో లేదో అప్పుడే దీనికి మొగుడి మీద మొహం మొత్తిందట!

అయినా ఈ కాలపు ఆడపిల్లల పనే బావుంది.

ఇండియాలో ఆడుతూ పాడుతూ చదువుకోడం, అమ్మా నాన్నలు అమెరికా మొగుడ్ని తెచ్చివ్వడం, వీళ్ళు చెంగున ఇక్కడకి వచ్చేయడం, తర్వాత ఇలా ఆడింది ఆటగా పాడింది పాటగా గడిపేయడం!

నేను కూడా ఈ టైములో పుట్టివుంటే ఎంత బావుండేది.

పిచ్చిమొహాన్ని పాతకాలంలో పుట్టి పదోక్లాస్ కూడా పూర్తికాకుండా పెళ్ళి చేసుకుని, పరాయిదేశం వచ్చి నానా పాట్లు పడి పైకి వచ్చాను.

ఏమిటీ నేను ఇంకొకసారి పిలిచి చూడాల్సిందంటారా?

అయ్యో ఆ సంబడమూ అయింది!

మీరు ఆ పిల్లను చూడాలని ఆశపడుతున్నారని, మీరింకా పిలవలేదని మీ అక్కయ్య నిష్టూరాలు ఆడతారని తెలిసి ముచ్చటగా మూడోసారి పిలిచాను.

ఈసారి ఫోను మీమనవరాలి మొగుడు తీసుకొని "సుచి ఇక్కడ లేదండీ. ఇండియా వెళ్ళింది" అన్నాడు.

నేను ఆదుర్దాగా "అందరూ బావున్నారా?" అని అడిగాను.

అతను తాపీగా ' అయ్యో అందరూ శుభ్రంగా వున్నారండి. సుచి వాళ్ళ అమ్మా నాన్నలను చూడక మూడు నెలలు దాటింది కదా అందుకని వెళ్ళిం" దన్నాడు.

పెళ్ళికి ముందే వాళ్ళు చెప్పారట. ఒక్కగానొక్క కూతుర్ని వదలి వాళ్ళు ఒక్క క్షణం కూడా వుండలేరుట ఇప్పటివరకు.

వాళ్ళ అమ్మాయిని ఎప్పుడంటే అప్పుడు పంపించే షరతు మీదే సుచిని నాకిచ్చారండీ అంటూ ఎంతో వినయంగా చెప్పాడు.

ఇలాంటి మగాళ్ళు మా రోజుల్లో ఎందుకు లేరో ?

మన పెళ్ళైన తర్వాత మీరు అమెరికా వెళ్ళిపోతే నేను రెండేళ్ళు మీ వాళ్ళింట్లోనే వున్నాను. ఏ పనిమీదో వచ్చినప్పుడు మా నాన్న, పెళ్ళికో పేరంటానికో వచ్చినప్పుడు మా అమ్మ నన్ను చూసి వెళ్తుండే వాళ్ళు. వచ్చినప్పుడల్లా మీదగ్గరనుండి ఉత్తరాలు వస్తున్నాయా? ఎప్పుడు నా ప్రయాణానికి టిక్కెట్టు పంపిస్తారూ? అని ఆదుర్దాగా అడిగేవాళ్ళు !

అమెరికాలో ఏదొరసాని వల్లో అయినా పడతారేమో అని అటు మావాళ్ళకు, ఇటు మీవాళ్ళకు ఒకటే భయం!

ఈ దేశం వచ్చిన పదేళ్ళకు గాని మనం ఇండియా వెళ్ళి మన వాళ్ళను చూడలేకపోయాం.

అప్పుడు కూడా అందరం కలిసి వెళ్ళడానికి అన్ని డబ్బులు మనకెక్కడివీ?

ఆ రోజుల్లో మీ జీతంలో సగం సరాసరి ఇండియాకి వెళ్ళిపోయేది!

ముందు మీరొక్కరే వెళ్ళారు.

అన్నేళ్ళ తర్వాత తిరిగొచ్చిన మిమ్మల్ని చూడ్డానికి ఎక్కడెక్కడి వాళ్ళో వచ్చారని మీ అమ్మగారు కథలుకథలుగా చెప్పేవారు!

మీరు వెళ్ళొచ్చిన ఏడాది తర్వాత పిల్లల్ని తీసుకుని నేను వెళ్ళాను.

ఇప్పటిలాగా ఇక్కడెక్కి అక్కడ దిగటమా?

ఎంత తతంగం ఎంత అవస్థ.

ఇక్కడి నుంచి దేశం వెళ్ళడం ఒక ఎత్తయితే, అక్కడనుంచి మన ఊళ్ళు చేరుకోవడం ఇంకో ఎత్తు.

ఆ రోడ్లు, ఆ ప్రయాణాలు, పిల్లలతో అక్కడ పడ్డ ఇబ్బందులు తలుచుకుంటే ఇప్పటికీ భయం వేస్తుంది.

మన పిల్లలు అక్కడ మన వాళ్ళందర్నీ చూసి "వీళ్ళంతా ఎవరూ?" అని అడిగేవారు.

మన వాళ్ళు పిల్లల మొహాలు, పిల్లలు వాళ్ళ మొహాలు చూసుకునేవారు!

సైగలు తప్ప మాటలుండేవి కాదు.

వాళ్ళను చూస్తుంటే చిన్నప్పుడు మా అమ్మమ్మ చెప్పే మూకీలు గుర్తొచ్చేవి!

అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడా ఎంత మార్పు?

మీ అక్కయ్య మనవరాలు లాంటి వాళ్ళకు మన సంగతులు చెప్తే నమ్మరు సరి కదా పగలబడి నవ్వుతారు!

ఇప్పటి తరం వాళ్ళు పక్క పేటకు వెళ్ళినంత తేలిగ్గా తిరుగుతున్నారు ఇండియాకు, అమెరికాకు.

మనలాగా 'ఇంటిమీద బెంగలు, ఇంటికి డబ్బు పంపించాల్సిన బాధ్యతలు, భాషలు రాకపోవడాలు, ఇండియా వెళ్ళి వున్న డబ్బు సరిపోతుందా అని అస్తమానం లెక్క పెట్టుకోడాలు ఇప్పటి వాళ్ళకు లేవు సరికదా, వాటి అర్థాలు కూడా వాళ్ళకు తెలియవు.

ఒక రకంగా ఇది మంచి మార్పే!

అప్పట్లో నాలుగు రాళ్ళు సంపాదించుకోడానికని దేశం వదిలిన మనం పరిస్థితుల కారణంగా 'ఎవరికి వారే ఎమునా తీరే' అన్నట్టుగా బతికాం.

ఇప్పటి వాళ్ళు చేతినిండా డబ్బులుండటంతో 'పరాయి దేశంలో వున్నా పక్కింట్లో వున్నట్టే' అన్న తీరులో వుంటున్నారు!

ఇండియా నుంచి వచ్చి ఇక్కడుంటున్న మీ అక్కయ్య మనవరాల్ని మీరు చూసేలోపు, పెళ్ళై అమెరికా వెళ్ళిన మనవరాల్ని మీ అక్కయ్యే ముందు చూసేస్తారులెండి!!

మీకు మీ అక్కయ్యగారు సొడ్డేసేది ఖాయం !!!